క్లుప్తంగా

5న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నాగులుప్పలపాడు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఆగస్టు 5వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహాలక్ష్మి తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులతో పాటు వివిధ శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరు కావాలని కోరారు.

నేడు సుపరిపాలనా వేదిక సర్వసభ్య సమావేశం

ఒంగోలు: సుపరిపాలనా వేదిక సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఆంధ్రకేసరి విద్యా కేంద్రంలో నిర్వహించనున్నట్లు వేదిక అధ్యక్ష, కార్యదర్శులు మాగులూరి నాగేశ్వరరావు, చిట్టెం వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర బడ్జెట్, భారతీయ నూతన క్రిమినల్ చట్టాల గురించి వివరిస్తారన్నారు. ప్రజానీకం ఈ అవగాహన సదస్సుకు హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు.

మంత్రి, జడ్జిని కలిసిన ఎస్పీ


జడ్జి శ్రీనివాసరెడ్డితో ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: జిల్లా నూతన ఎస్పీ ఏఆర్ దామోదర్ శనివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని కలిశారు. టంగుటూరు మండలంలోని తూర్పు నాయుడుపాలెం గ్రామంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా డోలాను కలిసి జిల్లాలో శాంతిభద్రతలపై చర్చించారు. అదేవిధంగా ఒంగోలు వచ్చిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి, జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి శ్రీనివాసరెడ్డిని ఒంగోలు ఎన్ఎస్పీ గెస్ట్‌హౌస్‌లో ఎస్పీ దామోదర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు

కురిచేడు: ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెదరావూరి మోహనకృష్ణ ద్విచక్ర వాహనాన్ని రోజు మాదిరి ఈ నెల 24న తన ఇంటి ఆవరణలో పెట్టి నిద్రించాడు. మరుసటి రోజు ఉదయం నిద్రలేచి చూసే సరికి వాహనం కనిపించలేదు. అనుమానం ఉన్నచోట వెతికి కనిపించక పోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఏసీ, ఫ్రిజ్‌ల మరమ్మతులపై శిక్షణ

ముండ్లమూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన యువతకు ఏసీ, ఫ్రిజ్ రిపేరుపై రూడ్ సెట్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని నిరుద్యోగ యువతకు ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 19 నుంచి 45 ఏళ్ల వయసు ఉన్న యువకులు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు ఉంటే అర్హులని తెలిపారు. శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆశక్తి ఉన్న యువకులు పూర్తి వివరాలతో 95733 63141 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మాలకొండ ఆదాయం రూ.7,83,556

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.7,83,556 వచ్చిన్నట్లు అలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.21,880, తలనీలాలు రూ.40,375, ప్రత్యేక దర్శనం రూ.2,31,500, లడ్డుప్రసాదాలు రూ.1,89,885, అన్నదానం రూ.2,15,864, రూమ్ అద్దెలు రూ.27,910 వచ్చినట్లు పేర్కొన్నారు.


విద్యుత్ ప్రభలు, లైటింగ్‌తో ఆలయాలు..


భారీగా తరలివచ్చిన భక్తులు

వైభవం.. బ్రహ్మోత్సవం

- కొత్తపట్నంలో కన్నుల పండువగా నాంచారమ్మతల్లి బ్రహ్మోత్సవాలు
- ఆకట్టుకున్న రేణుకా యుద్ధం కార్యక్రమం
- విద్యుత్ ప్రభల ఏర్పాటు
- భారీగా తరలివచ్చిన భక్తులు

కొత్తపట్నం: కొత్తపట్నంలో శ్రీ నాంచారమ్మతల్లి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రేణుకా యుద్ధం ఘట్టాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో రేణుకా యుద్ధం ఘట్టానికి ఎంతో విశిష్టత ఉంది. ప్రత్యేక వేషధారణలతో ఊరేగింపుగా జరిగే ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం నాలుగు గంటలకే చుట్టుపక్కల రహదారులన్నీ భక్తులతో నిండిపోయాయి. రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తకుండా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కూడా భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శనం చేసుకునేందుకు భక్తులు బారులుదీరారు. నాంచారమ్మతల్లితో పాటు పక్కనే ఉన్న గంగమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం రాత్రి గుర్రపు వాహనంపై శ్రీ నాంచారమ్మతల్లిని అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి మార్కెట్ సెంటర్, ఓరుగంటిరెడ్డిపాలెం, కోడూరివారిబజారు, జంగం బావి బజారు మీదుగా నాంచారమ్మ కాలనీవైపు నుంచి ఆలయానికి గ్రామోత్సవం చేరుకుంది. భక్తులు అమ్మవారికి బిందెలతో నీరు పోసి టెంకాయలు, పండ్లు, హారతులు సమర్పించారు. రాత్రికి ఏనుగు వాహనంపై నాంచారమ్మ తల్లికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈతముక్కల బజారు, పోస్టాఫీస్ బజారు, తుమ్మకూరిపాలెం, శివాలయం వీధి మీదుగా గ్రామోత్సవం సాగింది. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. విద్యుత్ ప్రభల ముందు డ్యాన్స్‌లు, చింతామణి నాటకం, మాధవ్ ఈవెంట్స్, వైజాగ్ జాన్సీ టీమ్, చిన్ని డ్యాన్స్ గ్రూప్ వారిచే డ్యాన్స్‌లు ప్రదర్శించారు. పీకేఎస్ఆర్ ఈవెంట్స్ మోటుమాల వారిచే డ్యాన్స్ ప్రదర్శించారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు – నెల్లూరు జిల్లా పొన్నపూడి వారి మధ్య 200 మందుచెట్లతో బాణసంచా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఆదివారం సాయంత్రం రూ.50 వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. నాలుగు రోజుల నుంచి భక్తులకు అసౌకర్యం కలగకుండా శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ వంశీకృష్ణ, శాంతకుమారి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. కొత్తపట్నం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం డాక్టర్ వైష్ణవి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే వెంటనే వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బ్రహ్మోత్సవాలు చూడటానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


100 అడుగుల విద్యుత్ ప్రభ


90 అడుగుల విద్యుత్ ప్రభ


రెడ్డిపాలెంలో కొనసాగుతున్న నాంచారమ్మతల్లి గ్రామోత్సవం


నాంచారమ్మతల్లి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

యువతలో విజయకాంక్ష రగిలించిన కలాం

- జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి
- గ్రంథాలయంలో ఘనంగా మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి

ఒంగోలు టౌన్: దేశ యువతలో విజయకాంక్షను రగిలించిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం భౌతికంగా మరణించినప్పటికీ దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కలాం వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి దేశ రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన కలాం.. ఎంతో నిరాడంబరంగా జీవించారని తెలిపారు. ఆయన ఆదర్శాలు, ఆశయాలను నేటి తరం కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. అత్యున్నత పురస్కారం భారతరత్న అవార్డుకు ఆయన ప్రతిరూపంగా నిలిచారని చెప్పారు. మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ది ఇండియాగా పేరొందిన కలాం ఈ దేశంలో జన్మించడం మనందరికీ గర్వకారణమని కొనియాడారు.


మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, సిబ్బంది

డీఎస్సీ శిక్షణ పొందుతున్న విద్యార్థుల కోసం అందుబాటులో పుస్తకాలు...

డీఎస్సీ శిక్షణ పొందుతున్న విద్యార్థుల కోసం 4 నుంచి 10వ తరగతి వరకు గవర్నమెంట్ పుస్తకాలు ఐదు సెట్లను జిల్లా గ్రంథాలయంలో అందుబాటులో ఉంచినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి తెలిపారు. అనేక మంది నిరుపేద, మధ్యతరగతి నిరుద్యోగులు జిల్లా గ్రంథాలయానికి డీఎస్సీ ప్రిపరేషన్‌కు వస్తున్నారని తెలిపారు. ఈ పుస్తకాల అవసరం ఉందని వారు అడిగిన వెంటనే స్పందించి ఏపీ గవర్నమెంటు టెస్ట్ బుక్స్ ప్రెస్ డైరెక్టర్ మంగళగిరి రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా మేనేజర్ శివాజీల దృష్టికి తీసుకెళ్లగా, వారు పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. అలాగే డీఎస్సీ అభ్యర్థుల కోసం జిల్లా గ్రంథాలయంలో గ్రేడ్–3 గ్రంథపాలకురాలిగా విధులు నిర్వహిస్తున్న కాళహస్తి సంపూర్ణ ఆరు సెట్ల డీఎస్సీ మెటీరియల్ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

పొదుపు సొమ్ము స్వాహాపై నిజాలు తేలుస్తాం


పొదుపు మహిళలతో మాట్లాడుతున్న ఏపీఎం

నాగులుప్పలపాడు: మండలంలోని ఒమ్మెవరం గ్రామంలో పొదుపు మహిళల సొమ్మును స్వాహా చేసిన విషయంపై త్వరలోనే నిజాలు తేలుస్తామని డీఆర్‌డీఏ ఏపీఎం హనుమంతరావు అన్నారు. శనివారం ఒమ్మెవరం గ్రామంలో పొదుపు సంఘాల మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో గ్రామంలో వీవోఏగా పనిచేసిన కోట అనిత, ఆమె కుమారులు వంశీకృష్ణ, నితిన్ నేతృత్వంలో రూ.30 లక్షల అవినీతి జరిగిందని, త్వరలో ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసి అవినీతి సొమ్ము రాబట్టనున్నట్లు తెలిపారు. వారిపై ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదై ఉన్నాయని, పోలీసుల సహకారంతో విచారణ చేపడతామని తెలిపారు. అదే విధంగా గ్రామంలోని పొదుపు మహిళలంతా లోకస్ యాప్‌లో వారి పొదుపు గ్రూపును రిజిష్టర్ చేసుకోవాలన్నారు. అలా అయితేనే ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రోత్సాహకాలు అందుతాయన్నారు. ఆయన వెంట సీసీ కవిత ఉన్నారు.

యూనివర్శిటీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి


వీసీ మూర్తికి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఒంగోలు టౌన్: ఆంధ్రకేసరి యూనివర్శిటీలో సుదీర్ఘకాలం నుంచి విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ కోరారు. ఆ మేరకు శనివారం యూనివర్శిటీ వైస్ చాన్సిలర్ మూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ యూనివర్శిటీకి అనుబంధంగా హాస్టళ్లు ఏర్పాటు చేయాలని, ఈ విద్యా సంవత్సరం నుంచే ఇంజినీరింగ్, లా కళాశాలలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రానికి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న మార్కాపురంలో యూనివర్శిటీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. యూనివర్శిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. యూనివర్శిటీలో అన్ని సబ్జెక్టులకు ప్రొఫెసర్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శ్యాం, అన్వేష్, లక్ష్మణ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

చదవడం, రాయడంపై శ్రద్ధ చూపాలి


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో ఇందిర

పుల్లలచెరువు: ప్రాథమిక స్థాయి నుంచి ప్రతి విద్యార్థి పాఠ్యపుస్తకాలు చదవడం, నోట్ పుస్తకాలు రాయడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో ఇందిర అన్నారు. శనివారం మండలంలోని నరజాముల తండాలోని ప్రభుత్వ పాఠశాలను ఆమె శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో ఆహార పదార్థాల రుచి చూశారు. విద్యాప్రవేశ, సంసిద్ధత, శిక్షసప్తాహ్ కార్యక్రమాల గురించి హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల సమార్థ్యాలను పరిశీలించారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులపై ప్రత్యేక చూపుతూ రాయడం, చదవడం నేర్పించాలన్నారు. ఇంగ్లిష్, తెలుగు ఆంశాలను చదవడం, రాయడం నేర్చుకోవడం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మొక్కలు నాటించారు.

దివ్యాంగులను జాగ్రత్తగా చూసుకోవాలి


దివ్యాంగుడిని పరిశీలిస్తున్న రమేష్

దొనకొండ: దివ్యాంగ విద్యార్థులను జాగ్రత్తగా చూసుకుని వారికి ఇంటి వద్దనే విద్య అందించాలని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎం.రమేష్ తెలిపారు. మండలంలోని పెద్ద గుడిపాడులో దివ్యాంగులకు ఇంటి వద్ద జరుగుతున్న విద్యా కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఉచితంగా ప్రతి వారం ఫిజియోథెరపీ క్యాంపులు నిర్వహించాలని ఐఈఆర్‌టీలకు సూచించారు. ప్రత్యేక విద్యను భవిత కేంద్రాల ద్వారా అందిస్తారని, అదే విధంగా ప్రభుత్వం వివిధ రకాల అలవెన్స్‌లు కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రమేష్ కోరారు. ఆయన వెంట ఐఈఆర్‌టీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న సోమ వెంకటరావు

పెద్దారవీడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని ఐటీసీ, ప్రథమ్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ సోమ వెంటరావు అన్నారు. మండలంలోని బద్వీడుచెర్లోపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పెద్దారవీడు, సుంకేసుల, చట్లమిట్ల సెక్టార్లలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఒక రోజు శిక్షణ శనివారం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసు పిల్లల సమగ్ర అభివృద్ధిని పెంపొందించాలని తెలిపారు. తల్లుల కమిటీ సమావేశాలు నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పూర్వ ప్రాథమిక విద్య అవశ్యకతను, వారి పిల్లల అభివృద్ధి స్థాయిలను విపులంగా వివరించాలని చెప్పారు. ఎఫ్ఎల్ఎన్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ రిమోట్ లెర్నింగ్ మెసేజ్‌ల ద్వారా ఏ రోజు నిర్వహించాల్సిన కృత్యాలను ఆదే రోజు నిర్వహించాలని సూచించారు. ఐసీడీఎస్ ద్వారా అందించిన ప్రీ స్కూల్ మెటీరియల్, పీపీ 1, పీపీ 2 వర్క్ బుక్స్‌లు రోజూ పిల్లలతో రాయించాలన్నారు. సూపర్‌వైజర్లు ఎన్. అంజమ్మ, ఎం.లక్ష్మీదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

త్రిపురాంతకం: ప్రతి విద్యార్థి న్యూట్రిషన్ ఫుడ్ తీసుకునే విధంగా సహకరించాలని, పౌష్టికాహార లోపం లేకుండా విద్యార్థులను చూడాలని ఎంఈఓ కె.తులసి మల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. మండలంలోని గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్ న్యూట్రిషన్, మొక్కలు నాటే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థికి పౌష్టికాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. హెచ్ఎం దీప్తి, సీఆర్‌పీ శ్యామ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పోటెత్తిన భక్తులు

కొనకనమిట్ల: వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం భక్తుల సందడి నెలకొంది. శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు.

పోలీసుల పహారా నడుమ చెత్త తొలగింపు


జేసీబీతో చెత్తను తీయిస్తున్న ఎస్సై మధుసూదన్‌రావు


పోలీసులతో వాగ్వాదానికి దిగిన కార్మికులు

కొమరోలు: తమ 20 నెలల జీతభత్యాలు చెల్లించాలంటూ విధులకు హాజరు కాకుండా పారిశుధ్య కార్మికులు 20 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. చెత్త సేకరించక పోవడంతో కొమరోలులోని 4 రోడ్ల కూడలి వద్ద చెత్తాచెదారం కుప్పలు తెప్పలుగా ఉంది. శనివారం స్థానిక ఎంపీడీఓ నరసింహారావు ఆధ్వర్యంలో ఇతరులతో జేసీబీ సాయంతో ట్రాక్టర్లలో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. చెత్తను తీసే క్రమంలో అక్కడికి పారిశుధ్య కార్మికులు చేరుకుని అడ్డుకున్నారు. స్థానిక ఎస్సై మధుసూదన్‌రావు తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని పారిశుధ్య కార్మికులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కొద్దిసేపు పారిశుధ్య కార్మికులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎస్సై మధుసూదన్‌రావు మాట్లాడుతూ పట్టణంలో రహదారి పక్కనే చెత్త ఎక్కువగా ఉండటంతో ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, తమ సమస్యలు కలెక్టర్‌కు తెలపాలని నచ్చజెప్పి అక్కడున్న చెత్తను జేసీబీ సాయంతో తీయించారు. తమ వేతనాలు చెల్లించాలంటూ కొమరోలులోని గ్రామ సచివాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ కొమరోలు గ్రామ పంచాయతీలో సర్పంచ్ అందుబాటులో ఉండటం లేదని, సర్పంచ్ తమ సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సర్పంచ్ అందుబాటులో ఉండి సమస్యలను పట్టించుకోవాలని, లేదా అధికారులు చొరవ తీసుకుని గ్రామ సర్పంచ్‌పై చర్యలు తీసుకుని తమ జీతభత్యాలు చెల్లించే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

రూ. 1.58 లక్షల విలువైన నిల్వలు సీజ్

కనిగిరి రూరల్: పట్టణంలోని ఎరువులు విత్తనాల షాపులపై వ్యవసాయ శాఖ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. స్థానిక రామాలయం వీధిలోని వాసవీ ఫర్టిలైజర్, జనరల్ మర్చంట్ షాపులో ఆకస్మిక తనిఖీలు చేసి విత్తనాల నిల్వలు, వ్యత్యాసాలు, స్టాక్ రిజిస్టర్ నందు నిల్వలకు, భౌతికంగా ఉన్న నిల్వలకు వ్యత్యాసాలు ఉన్నాయి. కొనుగోలు రసీదులను రైతులను ఇవ్వనట్లుగా గుర్తించారు. ఈ మేరకు విత్తన చట్టం ప్రకారం రూ 1.58,20 విలువైన వివిధ రకాల విత్తనాలు, సజ్జలు, కందులు, మినుములు, వరి విత్తనాలను సీజు చేసినట్లు తనిఖీ అధికారులు బాలాజీ నాయక్, మహబూబ్ బాషా, వ్యవసాయాధికారి పి.జ్యోత్స్నాదేవి తెలిపారు. షాపుపై 6ఏ కేసును నమోదు చేసి, జేసీ కోర్టుకు అప్పగించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

529 పొగాకు బేళ్లు కొనుగోలు

కొండపి (సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 529 బేళ్ళు కొనుగోలు జరిగాయని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. పొగాకు గరిష్ట ధర రూ. 358, కనిష్ట ధర రూ. 205, సరాసరి ధర రూ. 293.58 పలికింది. వేలంలో 20 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు శాకంబరి అలంకరణలో వల్లూరమ్మ తల్లి

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ తల్లికి ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం శాకంబరి అలంకరణలో ఇవ్వనున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి శనివారం రమేష్ తెలిపారు. భక్తులు తల్లి ఆశీర్వచనాలు తీసుకోవాలని కోరారు.

సాగర్ జలాలతో చెరువులు నింపాలి


సాగర్ ప్రధాన కాలువలో నీటి సరఫరా

త్రిపురాంతకం: నాగార్జున సాగర్ ప్రధాన కాలువ ద్వార జిల్లా ప్రజల దాహార్తి తీర్చేందుకు విడుదల చేసిన నీటితో చెరువులు నింపాలని ప్రజలు కోరుతున్నారు. సాగర్ జలాలు విడుదలై వారం గడిచి పోయింది. ఇప్పటికీ చెరువులు నింపేందుకు అధికారులు చర్యలు తీసుకోలేదు. కేవలం జలాశయాలు, ఎస్ఎస్ ట్యాంకులకు మాత్రమే నీరు సరఫరా చేస్తున్నారు. ప్రకాశం జిల్లా ప్రజల దాహార్తి తీర్చేందుకు విడుదల చేసిన సాగర్ జలాలతో గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, కుంటలను నింపేవారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని బోర్ల ద్వారా ప్రజల దాహార్తి తీరేది. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీరు అడుగంటింది. పశువులకు సైతం నీరు లేక పోవడంతో రైతాంగం పశువుల దాహార్తిని తీర్చ లేకపోతున్నారు. కేవలం ఎస్ఎస్ ట్యాంకులు, రామతీర్థం జలాశయం వంటి మంచి నీటి పథకాలను మాత్రమే నింపడంతో ఆయా పరిధిలో మాత్రమే కొంత మేర ఉపయోగం. సాగర్ జలాలు విడుదలై వారం రోజులైనందున ఇప్పటి నుంచైన గ్రామీణ చెరువులు నింపాల్సిన అవసరం ఉంది. జిల్లాలో నోటిఫైడ్, నాన్‌నోటిఫైడ్ చెరువులు, కుంటలు అడుగంటాయి. వీటిని సాగర్ జలాలతో నింపడంతో గ్రామీణ ప్రాంతాలు చాలా వరకు తాగునీటి సమస్యను అధిగమిస్తారు. జిల్లా అధికారులు ఈ దిశగా ఆలోచించి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.